రైతుల కోసం పోరాడుతాం..

- రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం..
- కవితను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మన్నెగూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్

డోర్నకల్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపిస్తే రైతుల తరపున పోరాటం చేస్తామని, రూ.2లక్షల రణమాఫీ చేసే వరకూ వదిలిపెట్టమని మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చిలుక్కోయలపాడు, మన్నెగూడెం, అందనాలపాడు, మోదుగుగడ్డ తండా, ముల్కలపల్లి, తోడేళ్లగూడెం, రాముతండా, వెన్నారం, బూర్గుపాడు, దుబ్బతండా, కన్నెగుండ్ల, చిల్కోడు, తెల్లబండతండా గ్రామాల్లో ఆయన బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇంకా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. డోర్నకల్ నియోజకవర్గ రైతులకు ఎస్సారెస్పీ జలాలు కూడా రాలేదన్నారు.

కాంగ్రెస్ వచ్చిన వెంటనే రైతులు, గ్రామాల్లో ప్రజలు కరెంట్ కష్టాలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. గతంలో ఎంపీలుగా పని చేసిన సీతారాంనాయక్, బలరాంనాయక్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. మరో 14 రోజులు బీఆర్ఎస్ నాయకులు కష్టపడి పని చేసి మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరిగి కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. వెన్నారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదు కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి రెడ్యానాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాముకుంట తండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తేజావత్ జశ్వంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్, మండల అధ్యక్షుడు నున్న రమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్లు చేరెడ్డి భిక్షంరెడ్డి, కొండపల్లి సీతారాంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యలమద్ది మన్మథరావు, మండల యూత్ అధ్యక్షుడు అంగోత్ హరీశ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు బోయినపల్లి వెంకన్న, పగడాల అంజయ్య, అంగోత్ మోహన్, ధనియాకుల వీరయ్య, పూల్ సింగ్, భద్రూ, బీఆర్ఎస్ నాయకులు మాన్యపాట్నీ, మధు సూదన్, అంగోత్ రమేశ్, కాడెం భిక్షం, బోయినపల్లి నాగేశ్వరరావు, వీరన్న, తాళ్లూరి సతీశ్, పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీఎంహెచ్‌వో అంబరీష

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

కురవి, ఏప్రిల్ 26 : కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీష శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్, వంద శాతం టీకాలు పూర్తి చేయాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రసవాల సంఖ్య పెంచి ప్రభుత్వ దవాఖానల్లోనే డెలివరీ చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలి

కేసముద్రం, ఏప్రిల్ 26 : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ అందించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు బ్యాక్ లాగ్ పోస్టులను విడుదల చేయాలని, రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ నెల 27న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న దివ్యాంగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథులుగా మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీరా సాహెబ్, ఉప్పల కేతమ్మ, ఉమేశ్, వెంకటయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలకు యువత బలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : దేశంలో బీజేపీ అవలంబిస్తున్న మతతత్వ రాజకీయాలకు యువత బలి అవుతున్నదని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ దళితులు, వెనకబడిన వర్గాలను అణచివేస్తున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘణపురపు అంజయ్య, కౌన్సిలర్లు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 26: తొర్రూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పేరుకుపోయిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ నర్కూటి గజానంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

ల్యాబ్‌లో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

జిల్లా వైద్యాధికారి కళావతి

బయ్యారం, ఏప్రిల్ 26: ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కళావతిబాయి హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని శ్రీరామ క్లీనిక్, అర్జున్ డయాగ్నొస్టిక్ సెంటర్, మధు ల్యాబ్, శ్రీగట్టు ముఖాంబిక ప్రథమ చికిత్సాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొన్ని చికిత్సా కేంద్రాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీ వైద్యులు నిబంధనలకు లోబడి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, కేంద్రాల్లో బెడ్స్ ఏర్పాటు చేయొద్దన్నారు. అర్హత కలిగిన దవాఖానల్లో ధరల పట్టికను ప్రదర్శించాలని, పనిచేసే సిబ్బంది వివరాలు, అర్హత, సర్టిఫికెట్లు దవాఖానల్లో అందుబాటులో ఉంచాలన్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పొల్యూషన్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత లేకుండా నడిపిస్తున్న అర్జున్ డయాగ్నొస్టిక్ సెంటర్, మధు ల్యాబ్, శ్రీముఖాంబికా ప్రథమ చికిత్సాలయాలు తమ పరిధికి మించి చికిత్స చేస్తున్నట్లుగా గుర్తించి నోటీసులు జారీ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సాగర్, సీహెచ్‌వో చందు, ఆరోగ్య విద్యా బోధకులు బీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న దేవందర్

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నెల్లికుదురు, ఏప్రిల్ 26 : మండలంలోని నైనాల గ్రామంలో ముదిరాజ్‌ల కుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంఈపీఏ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లు ఏ పని ప్రారంభించినా కుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి ఆశీర్వాదం తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో పెద్దమ్మ తల్లి గుళ్లను అధికారికంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎంఈపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరుత వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఐలయ్య, సురేశ్, తోట ఉప్పలయ్య, బత్తిని వెంక న్న, నారబోయిన మల్లయ్య, తోట యాకయ్య, వీరస్వామి, నారబోయిన గుట్టయ్య పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదు చేసిన మహిళ కు జరిమానా

పెద్దవంగర, ఏప్రిల్ 26 : తప్పుడు ఫిర్యాదు చేసిన మహిళకు మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ జరిమానా విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2023 సెప్టెంబర్ 22న బాలికపై లైంగికదాడి జరిగిందని తల్లి తప్పుడు ఫిర్యా దు చేయడంతో పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరు నెలలపాటు విచారణ చేపట్టి, న్యాయస్థానంలో సాక్షులను విచారిస్తున్న క్రమంలో తల్లి తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలింది. ఈ నెల 12న ఆ మహిళకు రూ.50 వేల జరిమానా లేదా 3 నెలల పాటు జైలు శిక్షను కోర్టు విధించింది. ఈ క్ర మంలో తప్పుడు ఫిర్యాదు చేసిన తల్లి శుక్రవారం జిల్లా కోర్టులో రూ.50వేల జరిమానా చెల్లించినట్లు తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : మహబూబాబాద్ పట్టణంలోని నందనా గార్డెన్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు బంధువు పొన్నమనేని రాజేశ్వర్ రావు కొడుకు వివాహం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీ రవీందర్‌రావు, సంధ్యారాణి దంపతులు వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు, సంధ్యారాణి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, ఏప్రిల్ 26 : ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కొలతలతో నిమిత్తం లేకుండా రూ.650 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. టెంట్లు, మెడికల్ కిట్లు, చల్లని తాగునీరు పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించాలని కోరారు.

తొర్రూరు: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న యాకూబ్

కనీస సౌకర్యాలు కల్పించడం లేదు..

కేసముద్రం: ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆధార్‌కార్డు లింక్ పేరుతో కూలీలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. పనిప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వీరన్న, బీ వెంకటేశ్వర్లు, కట్టయ్య, యాకయ్య, జీ రాంప్రసాద్ పాల్గొన్నారు.

రోజువారీ కూలి రూ.600 చెల్లించాలి

నెల్లికుదురు: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కొలతలతో పనిలేకుండా రోజుకు రూ.600 చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరామగిరి, బంజర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి పనుల వద్ద తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగు నీటి సౌకర్యం, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందించాలన్నారు. మోదీ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తున్నదన్నారు. ఉపాధి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కూలీలు మృతి చెందితే రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా, అంగవైకల్యం ఏర్పడితే రూ.10లక్షల బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం వీరన్న, ఉమ్మగాని సత్యం, ఇరుగు అనిల్, కుమార్, పుల్లయ్య, రాములు, వెంకటమ్మ, కృష్ణమూర్తి, సైదమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గూడూరు, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పరిమతికి మించి వాహనాల్లో గానీ, వ్యక్తిగతంగా గానీ రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లొద్దని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబూరావు, ఎస్సై నగేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డోర్నకల్: వాహనదారులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ ఉపేందర్‌రావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం డోర్నకల్ ఎన్టీఆర్ సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని వర్గాలు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సంతోశ్ రావు, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

పెద్దవంగర: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పెద్దవంగర మండల కేంద్రంలోని వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై శుక్రవారం పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో తొర్రూరు, దంతాలపల్లి ఎస్సైలు జగదీశ్, కరుణాకర్ వాహన తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనదారులు నిబంధనలు పాటిస్తూ నగదు, ఇతర సామగ్రిని తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుధాకర్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్

బావిలో పడి వృద్ధుడి మృతి

ఇనుగుర్తి, ఏప్రిల్ 26 : బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని అయ్యగారిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మలిశెట్టి సారయ్య (70) రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని బేటిచెరువు సమీపంలో ఉన్న బావిలో శవమై కనించాడు. సారయ్యకు మతిస్థిమితం బాగాలేక కొంత కాలంగా ఇబ్బందిపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సారయ్యకు భార్యతోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సారయ్య (ఫైల్)

చికిత్స పొందుతూ ఒకరు..

పెద్దవంగర, ఏప్రిల్ 26 : రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన ఎడవెల్లి అశోక్‌రెడ్డి (45) ఈ నెల 24న పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొర్రూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అశోక్(ఫైల్)

విద్యార్థి అదృశ్యం

కురవి, ఏప్రిల్ 26 : విద్యార్థి అదృశ్యమైన ఘటన కందికొండలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కందికొండకు చెందిన తోట కందయ్య కొడుకు తోట ఉదయ్‌కిరణ్ (18) మరిపెడ తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ఫలితాలు చూసుకొని వస్తానని ఈ నెల 24న ఇంట్లో చెప్పి మహబూబాబాద్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోగా, ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. అతడి స్నేహితుడి ఫోన్ చేస్తే మీ కొడుకు ఇంటర్ ఫెయిల్ అయ్యాడని చెప్పాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో సీరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉదయ్ కిరణ్

విద్యార్థి ప్రణీతకు సన్మానం

గార్ల, ఏప్రిల్ 26: ఇంటర్ ఫలితాల్లో 468 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించిన బుద్దారం గ్రామానికి చెందిన పల్లెబోయిన ప్రణీతను శుక్రవారం సీపీఎం నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందునూరి శ్రీనివాస్, జడ శ్రీను, సంపసాల వెంకన్న, నాగేశ్వరావు, యూటీఎఫ్ నాయకులు సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణీతను సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

బిజినెస్ ఆఫర్

★స్త్రీ/పు అవకాశం తక్కువ పెట్టుబడితో 25 రకాల వెజ్–నాన్ వెజ్ పచ్చళ్ళు షాపుని మీ ఏరియాలో స్థాపించి నెలకు 30 వేలు ఆపైన ఆదాయం పొందండి. సెల్: 8143909459.
NTW-323248

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం పట్టణంలోని గోపాలపురం కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పది రోజుల నుంచి నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వాటర్ పైపులు వేశారని, మిగతా చోట్ల వేయకపోవడంతో నీళ్లు రావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి రోజూ భగీరథ నీరు సరఫరా చేయాలని, నీళ్లు రాని రోజుల్లో ట్యాంకర్ల ద్వారా అందించాలన్నారు. అనేక సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

ఖాళీ బిందెలతో గోపాలపురం కాలనీవాసుల నిరసన

రోడ్డు పైన నిరసన తెలుపుతున్న గోపాలపురం కాలనీ వాసులు

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నగూడూరు: గుండంరాజుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈసీసీఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ కవిత, సిబ్బంది

చిన్నగూడూరు, ఏప్రిల్ 26 : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. గుండంరాజుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఈసీసీఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్థకమైన పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సంధ్య, సుమలత, శ్రీమతి, ఆయాలు పాల్గొన్నారు.

కంఠాయపాలెం సెంటర్‌లో..

తొర్రూరు: మండలంలోని కంఠాయపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఈసీసీఈ అన్యువల్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో హైమావతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలు ఆటపాటల ద్వారా విద్యనభ్యసిస్తారని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఇందిరమ్మ, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, శైలజ, పద్మ, పిలలు, తల్లులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 26 : రోడ్డు ప్రమాదంలో హోంగార్డు దుర్మరణం చెందిన ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడేనికి చెందిన వారాల శ్రీనివాస్(40) జనగామ అర్బన్ పీఎస్‌లో కారు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో పూలకుండిని ఢీకొని మృతి చెందాడు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన తన బంధువులను పరామర్శించి తిరిగి వస్తుండగా దుర్ఘటన జరిగింది. మృతుడికి భార్య రాజేశ్వరితో పాటు ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. అందరితో కలుపుకోలుగా ఉండే శ్రీనివాస్ మృతితో పోలీసులతో పాటు బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. జిల్లా ఆసుపత్రిలో శ్రీనివాస్ మృతదేహానికి శుక్రవారం పలువురు పోలీసు అధికారులతో పాటు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జాఫర్‌గూడేనికి తరలించారు.

శ్రీనివాస్ (ఫైల్)

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

దంతాలపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ముదిరాజుల ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రమణశర్మ, పవన్‌శర్మ ఆధ్వర్యంలో దేవాలయంలో చండీహోమం, లక్ష్మీగణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

సమాజ హితం ప్రతి ఒక్కరి బాధ్యత

బయ్యారం, ఏప్రిల్ 26: సమాజ హితం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐపీఎస్, ట్రైనీ ఎస్‌హెచ్‌వో పండరి చేతన్‌నితిన్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన 15 సంవత్సరాల దివ్యాంగురాలు పాముల అమూల్య వీల్ చైర్ లేక ఇబ్బంది పడుతుండగా, హోప్ స్టెప్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్‌ను ఐపీఎస్ చేతుల మీదుగా అందజేశారు. పేద కుటుంబాలకు సాయం చేస్తూ సమాజ హితాన్ని కోరుకోవడం మంచి విషయమని ఐపీఎస్ తెలిపారు. అందుకు కృషి చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్సై మౌలానా, ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు శ్రీరాం, రమేశ్, నితిన్, శివతేజ్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందిస్తున్న ఐపీఎస్ చేతన్‌నితిన్